RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

WEB : WWW.rajadhanivoice.com rajadhanivoicedaily@gmail.com

సంపుటి : 02 | సంచిక : 269 | 21 శుక్రవారం ఆగష్టు 2026 | ఎడిటర్ : పొగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రిక కు బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాలకు ఇంచార్జ్ లు మరియు మండలాలవారిగా విలేఖరులు కావలెను. ఆసక్తిగలవారు సంప్రదించగలరు. 9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

## దక్షిణ మండలి సమావేశానికి చంద్రబాబు హాజరు

**- మహాబలిపురంలో కీలక భేటీ ప్రారంభం - అమిత్ షా నేతృత్వంలో సమావేశం**

**- దక్షిణాది రాష్ట్రాల సమస్యలపై చర్చ - అభివృద్ధి, కేటాయింపులపై దృష్టి**




**మహాబలిపురం, ఆగస్టు 20 :** కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో తమిళనాడులోని మహాబలిపురంలో నిర్వహిస్తున్న 31వ దక్షిణ మండలి సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమన్వయం, అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి పలువురు ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు పుదుచ్చేరి ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ప్రాంతీయ అభివృద్ధి, రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, కేంద్ర-రాష్ట్ర సంబంధాల బలోపేతం వంటి అంశాలు ప్రధాన ▶▶2

## మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన నిరసనలు

**- జనగణనకు ముందు పౌర పట్టిక నవీకరణ డిమాండ్**

**- రెండు రోజుల సార్వత్రిక సమ్మెకు పిలుపు**

**- పలు జిల్లాల్లో రహదారుల దిగ్బంధనం**

**- మూడు రోజుల పాటు విద్యాసంస్థల మూసివేత**




**ఇంఫాల్, ఆగస్టు 20 :** బీజేపీ పాలిత మణిపూర్‌లో మరోసారి నిరసనల జ్వాలలు రగిలాయి. రాష్ట్రంలో జనాభా గణన చేపట్టే ముందు జాతీయ పౌర పట్టికను నవీకరించాలని వివిధ సామాజిక సంస్థలు డిమాండ్ చేస్తుండటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అంతర్గతంగా స్థానభ్రంశం చెందిన ప్రజలు తమ స్వస్థలాలకు తిరిగి చేరే వరకు జనగణన నిర్వహించకూడదని ఆందోళనకారులు పట్టుబడుతున్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం న్యాయమైన, నిష్పక్షపాత పునర్విభజన ప్రచార సంస్థ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో 48 గంటల సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చిన ఉద్యమకారులు మణిపూర్ లోయ ప్రాంతంలోని పలు జిల్లాల్లో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, బిష్ణుపూర్, తౌబల్ జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో రహదారులను దిగ్బంధించి రాకపోకలకు అంతరాయం కలిగించారు. దీంతో సాధారణ ప్రజల జీవనం తీవ్రంగా ప్రభావితమైంది.ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖురాయ్ లామ్‌లాంగ్ ప్రాంతంలో నిరసనకారులు రాష్ట్ర ముఖ్యమంత్రి ఖేమ్‌చంద్ సింగ్, హోం శాఖ మంత్రి గోవిందాస్ కొంతౌజమ్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆందోళనకారులు తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలను కూడా బహిష్కరించాలని ఉద్యమకారులు నిర్ణయించారు. గురువారం నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల కార్యక లాపాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. దీంతో ప్రభుత్వ యంత్రాంగంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 20 నుంచి 22 వరకు రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అదేవిధంగా తౌబల్ జిల్లాలో నిర్వహించాల్సిన జనగణన శిక్షణా కార్యక్రమాన్ని కూడా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. నిరసనలు మరింత ఉధృతమయ్యే అవకాశాల నేపథ్యంలో ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అప్రమత్తంగా వ్యవహరిస్తామని అధికారులు పేర్కొన్నారు.

## పేద విద్యార్థులకు అత్యాధునిక సౌకర్యాలతో ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్

**మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి**



**రాజధాని వాయిస్, అమరావతి, ఆగస్టు 20 :** ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, అత్యాధు నిక సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి సంబం ధిత అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలో గుంటూరు జిల్లా తాడికొండలోని ఐఐటి నీట్ ఎక్సలెన్సీ సెంటర్ లో అదనపు భవనాల నిర్మాణం, విద్యార్థులకు సౌకర్యాల కల్పనపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐటీ, నీట్ క్యాంపస్ నిర్మాణ నమూనాను మంత్రి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడు తూ... క్యాంపస్ లో అదనపు భవనాల నిర్మాణం, అంతర్గత రోడ్లతో పాటు వాకింగ్ ట్రాక్,బ్యాట్మెంటన్ కోర్టు, కోకో కోర్టు, మల్టీపర్పస్ కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం ఉండేలా నిర్మాణాలు, ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. పేద విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష అని మంత్రి తెలిపారు. ఐఐటీ నీట్ ఎక్సలెన్సీ సెంటర్ల ద్వారా పేద విద్యార్థులకు బంగారు భవితను అంది ంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి అన్నారు. ఈ సమీక్షలో APSWREIS కార్యదర్శి IAS వి.ప్రసన్న వెంకటేష్ , AP EW IDC EE అనిల్ కుమార్, గుంటూరు జిల్లా ఎస్సి కార్పొరేషన్ ఈడీ దుర్గా బాయి, APSWREIS డీసీవో తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-1 వివాదంపై జగన్ సవాల్

**సీబీఐ విచారణకు సిద్ధమన్న వైసీపీ అధినేత**

**డీఎస్సీ అంశంపై చంద్రబాబును ప్రశ్నించిన జగన్**

**ఉద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోవద్దని వ్యాఖ్య**



**రాజధాని వాయిస్, తాడేపల్లి, ఆగస్టు 20 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై వైఎస్సా ర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమ ంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామ కాల వ్యవహారంలో తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. డీఎస్సీ అక్రమాల అంశం నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ వివాదాన్ని సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. గ్రూప్-1 నియామకాలపై సీబీఐ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని, అదే విధంగా డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తుకు ప్రభుత్వం సిద్ధమా అని ప్రశ్నించారు. గ్రూప్-1 నియామకాల ప్రక్రియను ప్రస్తావించిన జగన్, ఈ నోటిఫికేషన్‌ను 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వమే విడుదల చేసిందని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాకముందే ప్రిలిమినరీ పరీక్ష పూర్తైందని తెలిపారు. అనంతరం తమ హయాంలో ఫలితాలు ప్రకటించి, 2020 డిసెంబర్‌లో మెయిన్స్ పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. టీడీపీ పాలనలో ప్రారంభమైన ప్రక్రియను ఇప్పుడు రాజకీయ కోణంలో చూడడం సరికాదని వ్యాఖ్యానించారు.కోవిడ్ పరిస్థితుల కారణంగా మూల్యాంకనంలో జాప్యం జరగకుండా ఉండేందుకు ఏపీపీఎస్సీ డిజిటల్ మూల్యాంకన విధానాన్ని పరిశీలించిందని జగన్ తెలిపారు. అయితే దీనిపై కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం సూచనల మేరకు డిజిటల్ విధానాన్ని పూర్తిగా పక్కనపెట్టామని చెప్పారు. అనంతరం మాన్యువల్ విధానంలోనే జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించామని, అదే మార్కుల ఆధారంగా ▶▶2

## విద్యా రంగంలో ఐదు కీలక బిల్లులు

### శాసనమండలిలో ఏకగ్రీవ ఆమోదం

**▶▶ మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన బిల్లులు**

**▶▶ ఉన్నత విద్య, గ్రంథాలయ రంగాల్లో సంస్కరణలు**

**▶▶ నైపుణ్య విశ్వవిద్యాలయాలకు మార్గం సుగమం**

**రాజధాని వాయిస్, అమరావతి, ఆగస్టు 20 :** ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో విద్యా రంగానికి సంబంధించిన ఐదు కీలక బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం లభించింది. రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, సభ్యులందరి మద్దతుతో మండలి వాటిని ఆమోదించింది. విద్య, గ్రంథాలయాలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సంస్కరణలను వేగవంతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించినట్లు వెల్లడించింది. శాసనమండలి సమావేశం లో మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన బిల్లుల్లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్రంథాలయాల సవరణ బిల్లు--2026 ఒకటి. రాష్ట్రంలోని గ్రంథాలయ వ్యవస్థను ఆధునికీకరించడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ బిల్లును తీసుకువచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది.

**నారా లోకేశ్ ప్రవేశపెట్టిన బిల్లులు** ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య నియ ంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లుకు కూడా మండలి ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యా సంస్థల పనితీరును మరింత సమర్థవంతంగా పర్యవేక్షించడం, విద్యా ప్రమాణా లను మెరుగుపరచడం ఈ సవరణల ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వివరించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, రాష్ట్ర విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కేడర్‌లో రిజర్వేషన్‌కు సంబంధించిన సవరణ బిల్లులను కూడా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ బిల్లుల ద్వారా విద్యా వ్యవస్థలో పారద ర్శకత, సమాన అవకాశాలకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని ప్రభుత్వం అభిప్రాయపడింది.రాష్ట్రంలో ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాల యాల ఏర్పాటు కోసం తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు



నైపుణ్య విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు కూడా మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించే సంస్థల ఏర్పాటుకు ఈ బిల్లు దోహదపడనుంది. సభలో ప్రవేశపెట్టిన ఐదు బిల్లులకు అన్ని రాజకీయ పక్షాల సభ్యులు మద్దతు తెలపడంతో అవి ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. విద్యా రంగంలో నాణ్యత పెంపు, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్య విస్తరణ లక్ష్యాల సాధనలో ఈ బిల్లులు కీలక పాత్ర పోషిస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## ఐజీఐ విమానాశ్రయంలో కార్గో సేవల ప్రారంభం



**రాజధాని వాయిస్న్యూఢిల్లీ,:** పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ట్రాన్స్‌షిప్‌మెంట్ కార్గో కార్యకలాపాలను ప్రారంభించారు. దేశీయ, అంతర్జాతీయ కార్గో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ సేవలను ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంచడంతో పాటు వ్యాపార కార్యకలాపాలకు మరింత ఊతమివ్వనుంది. ప్రయోగాత్మక దశలో విజయవంతమైన ఫలితాలు రావడంతో ఈ నెట్‌వర్క్‌ను మరిన్ని నగరాలకు విస్తరించారు. దేశీయంగా బెంగళూరు, అహ్మదాబాద్, ముంబయి, హైదరాబాద్ నగరాలను కొత్తగా ఈ వ్యవస్థలో చేర్చారు. దీంతో దేశంలోని ప్రధాన వ్యాపార, పారిశ్రామిక కేంద్రాల మధ్య కార్గో రవాణా మరింత సులభతరం కానుంది. అంతర్జాతీయంగా లండన్, కోపెన్‌హేగన్ నగరాలను కూడా ఈ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేశారు. భారతదేశం నుంచి విదేశీ మార్కెట్లకు సరుకుల రవాణా వేగవంతం కావడంతో పాటు అంతర్జాతీయ వాణిజ్యానికి మరింత ▶▶2

## ఏడుగురు మత్స్యకారుల కోసం భారీ సెర్చ్ ఆపరేషన్

**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 20:** వాడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు చెందిన బోటులో చేపల వేటకు వెళ్లి అదృశ్యమైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం భారత నౌకాదళం, భారత తీర రక్షక దళం సమన్వయంతో సెర్చ్ అండ్ రెస్క్యూ (SAR) ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మత్స్యకా రులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడమే లక్ష్యంగా సముద్రం, గగనతలం నుంచి విస్తృతంగా గాలిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 3న ఏడుగురు మత్స్యకారులతో బోటు చేపల వేటకు వెళ్లిందని, నిర్ణీత సమయానికి తిరిగి రాకపోవడంతో సమాచారం అందిన వెంటనే సంబంధిత శాఖలను అప్రమత్తం చేసి గాలింపు చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఆగస్టు 17 నుంచి భారత తీర రక్షక దళానికి చెందిన ఐదు నౌకలు గాలింపు చర్యల్లో పాల్గొంటుండగా, భారత నౌకాదళం మరో ▶▶2

## సీదిరి అప్పలరాజుకు జగన్ భరోసా

**అక్రమ కేసులతో వేధింపులపై ఆరా**
**కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన జగన్**
**పార్టీ అండగా ఉంటుందని స్పష్టం**



**రాజధాని వాయిస్, తాడేపల్లి, ఆగస్టు 20 :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులతో కలిసి తాడేపల్లి లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పరిణామాల పై ఇద్దరి మధ్య చర్చ జరిగింది. అక్రమ కేసులో అరెస్టై 23 రోజుల పాటు శ్రీకాకుళం జైలులో ఉన్న డాక్టర్ సీదిరి అప్పలరాజుతో జగన్ ప్రత్యేకంగా మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జైలులో ఉన్న సమయంలో ఎదురైన పరిస్థితులు, అనంతర పరిణామాల గురించి ఆరా తీశారు.రాజకీయంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని అప్పలరాజుకు జగన్ సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మనోధైర్యం కోల్పోకుండా ప్రజల మధ్య ఉండాలని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని అప్పలరాజుకు జగన్ భరోసా ఇచ్చారు. పార్టీ తరపున అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. అప్పల రాజు కుటుంబ సభ్యులతో కూడా జగన్ మాట్లాడారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, క్లిష్ట పరిస్థితుల్లో పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. పార్టీ నాయకత్వం తమకు అండగా ఉందన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తూ అప్పలరాజు కృతజ్ఞతలు తెలిపారు.

## అమరావతిలో ఎంట్రీకి అందుబాటులోకి రానున్న మరిన్ని రహదారులు.. మంత్రి సమీక్ష

**రాజధాని వాయిస్, అమరావతి, ఆగస్టు20:** రాజధాని అమరావతి లో ఎంట్రీకి మరిన్ని రహదారులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంతో ఇతర రహదారుల కనెక్టివిటీపై మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారా యణ దృష్టి సారించారు. గురువారం E 13, E 15, E 1, E 3 రహదారి నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.మంగళగిరి నుంచి అమరావతికి లోకి ప్రవేశించే జు 15 రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రికి అధికారులు వివరించారు.16వ నెంబర్ జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్ ద్వారా అమరావతిలోకి జు 13 రోడ్డు ప్రవేశించనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డు (జు 3) మూడో ఫేజ్‌లో నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ (స్టీల్ బ్రిడ్జి – మణిపాల్ హాస్పిటల్) పనులు కూడా త్వరగా ప్రారంభించాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు.సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమాంతరంగా కరకట్టను వెడల్పు చేస్తూ ప్రకాశం బ్యారేజీ వరకూ జు 1 రోడ్డును నిర్మిస్తున్నారు. ఆయా రోడ్ల నిర్మాణాలకు అవసరమైన రైల్వే ఇతర అనుమతులు దాదాపు కొలిక్కి వచ్చాయని మంత్రి నారాయణ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. రోడ్ల పనులకు ఆటంకాలు లేకుం డా అవసరమైన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ను ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశానికి సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ కార్తీక్, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మతోపాటు వివిధ శాఖల ఇంజినీర్లు హాజరయ్యారు.

## స్థానిక ఎన్నికలకు జనసేన సిద్ధం.. పవన్ కీలక ఆదేశాలు

**రాజధాని వాయిస్, అమరావతి, ఆగస్టు 20:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన సమాయత్తమవుతోంది. ఈ మేరకు అమరావతిలో పవన్ కల్యాణ్ అధ్యక్షతన జరిగిన శాసనసభాపక్ష సమావేశంలో ఎన్నికల వ్యూహంపై కీలక చర్చ జరిగింది. శాసనసభ ఎన్నికల సమయంలో పొత్తు ధర్మాన్ని పాటిస్తూ.. పార్టీ కోసం నిలబడిన జనసేన కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా స్థానిక ఎన్నికల్లో బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కార్యకర్తల అభిప్రాయాలు, మనోభావాలను గౌరవించేలా ఎన్నికలకు సిద్ధం కావాలని నేతలు భావించారు. రాష్ట్రంలోని 21 జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై పవన్ కల్యాణ్ ఆరా తీశారు. అలాగే ఆయా నియోజకవర్గాలతో పాటు పార్టీకి బలమున్న ఇతర ప్రాంతాలను గుర్తించి స్థానిక ఎన్నికలకు వ్యూహం సిద్ధం చేయాలని నేతలు నిర్ణయించారు.మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం మంచిదేనని సమావేశంలో ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల్లో పార్టీ బలాబలాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పవన్ కల్యాణ్ సూచించారు. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లకు సంబంధించి నియోజకవర్గాల్లో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులపై కూడా సమావేశంలో చర్చించారు. కార్యకర్తలు చెబుతున్న సమస్యలను ఎమ్మెల్యేలు స్వయంగా విని.. వాటి పరిష్కారాని కి కృషి చేయాలని పవన్ సూచించారు. జనసేన యంత్రాం గం స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిస్తూ.. పొత్తుల అంశాన్ని తాను చూసుకుంటానని స్పష్టం చేశారు. ఎవరూ పార్టీ లైన్ దాటి మాట్లాడవ ద్దని నేతలకు.. కార్యకర్తలకు పవన్ కల్యాణ్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పొత్తు ధర్మాన్ని పాటిస్తూనే కార్యకర్తల మనోభావాలకు ప్రాధాన్యం ఇచ్చేలా స్థానిక ఎన్నికల్లో పార్టీ బలాన్ని చూపించాలని జనసేన భావిస్తోంది.

# దక్షిణ మండలి సమావేశానికి చంద్రబాబు హాజరు



చర్చాంశాలుగా నిలవనున్నాయి.దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ఈ సమావేశంలో ప్రస్తావించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధి, రవాణా అనుసంధానం, అంతర్రాష్ట్ర జల వనరుల వినియోగం, భద్రతా అంశాలు, పరిపాలనా సమన్వయం వంటి విషయాలపై విస్తృత చర్చ జరగనుంది. రాష్ట్రాలకు కేంద్రం నుంచి లభించాల్సిన నిధులు, ప్రాజెక్టుల కేటాయింపులు, అభివృద్ధి కార్యక్రమాల అమలు పురోగతి వంటి అంశాలు కూడా సమావేశంలో ప్రాధాన్యత పొందనున్నాయి. దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది.చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను ఈ సమావేశంలో ప్రస్తావించే అవకాశము ందని సమాచారం. ముఖ్యంగా రాష్ట్ర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడుల ప్రోత్సాహం, కేంద్ర సహకారం అవసరమైన కార్యక్రమాలపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉందని భావిస్తున్నారు. దక్షిణ మండలి సమావేశాలు రాష్ట్రాల మధ్య సహకారాన్ని పెంపొందించడంతో పాటు ప్రాంతీయ సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు కీలక వేదికగా నిలుస్తున్నాయి. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి, పరిపాలనా సమన్వయానికి దోహదపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## భోగాపురం విమానాశ్రయానికి భువనేశ్వరి ప్రశంసలు



**రాజధాని వాయిస్ భోగాపురం, ఆగస్టు 20 :** భోగాపురంలోని అల్లూరి సీతారా మరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తొలిసారిగా సందర్శించిన నారా భువనే శ్వరి అక్కడి నిర్మాణ శైలి, సాంస్కృ తిక ప్రతిరూపాలపై ప్రశంసలు కురిపించారు. విమానాశ్రయా నికి అల్లూరి సీతారామ రాజు పేరు పెట్టడం ఎంతో అర్థవం తమైన విషయమని పేర్కొన్నారు. విమా నాశ్రయంలో అడు గుపెట్టిన వెంటనే ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాల ను ఆధునిక వాతావరణం లో అద్భుతంగా ప్రతిబింబి ంచేలా రూపొందించిన తీరు తనను ఆకట్టుకుం దని ఆమె తెలిపారు. కలంకారి కళాఖండా లు, సంప్రదాయ శిల్పాలు, బొబ్బిలి వీణ స్వరాలను గుర్తు చేసే కళారూపాలు ప్రత్యేకంగా నిలిచాయని చెప్పారు.విమానా శ్రయంలో ఏర్పాటు చేసిన 120 మీటర్ల ఎల్‌ఈడీ ప్రదర్శన ద్వారా రాష్ట్రంలోని ఆలయాలు, సంప్రదాయాలు, వారసత్వా న్ని చూపిస్తున్న తీరు ఆకర్షణీయంగా ఉందని భువనేశ్వరి పేర్కొన్నారు. ఇది రాష్ట్ర సాంస్కృతిక గొప్పతనాన్ని సందర్శకులకు పరిచయం చేసే వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. తెలుగు ఇంటి ముగ్గులను తలపించే సీలింగ్ రూపకల్పన, సన్నాయి మేళం స్ఫూర్తితో రూపొందించిన అలంకరణలు, తోలుబొమ్మలాట కళారూపాన్ని ప్రతిబింబించే అంశాలు ప్రత్యేకంగా నచ్చాయని ఆమె తెలిపారు. ఈ రూపకల్పనలు తెలుగు సంస్కృతి వైభవాన్ని చాటుతున్నాయని అన్నారు.ఆధునిక సదుపాయాలతో రూపుదిద్దుకున్న ప్పటికీ విమానాశ్రయం ప్రతి మూలలో ఆంధ్ర ఆత్మ ప్రతిఫలిస్తోందని భువనేశ్వరి పేర్కొన్నారు.

## ఏడుగురు మత్స్యకారుల కోసం భారీ సెర్చ్ ఆపరేషన్

రెండు నౌకలను రంగంలోకి దించడంతో ప్రస్తుతం మొత్తం ఏడు నౌకలు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయని వెల్లడించారు. నేవీకి చెందిన ఒక నౌక విశాఖపట్నం నుంచి పారాదీప్ వైపు, మరో నౌక ఓడలరేవు వైపు గాలింపు కొనసాగిస్తున్నట్లు వివరించారు.సముద్రంలో గాలింపుతో పాటు వైమానిక సెర్చ్ ఆపరేషన్‌ను కూడా మరింత విస్తృతం చేసినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. విశాఖపట్నం, కోల్‌కతా, చెన్నై కేంద్రాల నుంచి డోర్నియర్ విమానాలతో సెర్చ్ సార్టీలు నిర్వహిస్తున్నామని, కోల్‌కతా నుంచి నేవీ హెలికాప్టర్‌ను కూడా గాలింపు చర్యలకు వినియోగి స్తున్నామని చెప్పారు. సముద్రంలోని సంభావ్య ప్రాంతాలను గగనతలం నుంచి జల్లెడ పడుతూ గాలింపు పరిధిని నిరంతరం విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. హల్దియా, పారాదీప్ కోస్ట్‌గార్డ్ కేంద్రాలను కూడా గాలింపు చర్యల్లో భాగస్వామ్యం చేశామని మంత్రి తెలిపారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగిస్తూ సముద్ర ప్రాంతంలో విస్తృతంగా గాలిస్తున్నామని, గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.భారత నౌకాదళం, భారత తీర రక్షక దళం పరస్పర సమన్వయంతో గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయని, రాష్ట్ర మత్స్య శాఖ అధికారులు కూడా సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా బోటు ప్రయాణించి ఉండే అవకాశమున్న సముద్ర మార్గాలు, తీర ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని గాలింపు పరిధిని మరింత విస్తరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు మత్స్యకారుల ఆచూకీకి సంబంధించి సానుకూల సమాచారం అందకపోయినా ఏ దశలోనూ ప్రయత్నాలను ఆపడం లేదు. ఏడు నౌకలతో పాటు డోర్ని యర్ విమానాలు, నేవీ హెలికాప్టర్‌తో విస్తృతంగా గాలిస్తున్నాం. నేవీ, కోస్ట్‌గార్డ్, మత్స్యశాఖ మధ్య నిరంతర సమన్వయం కొనసాగుతోంది. ఒక్క అవకాశం కూడా వదలకుండా మన మత్స్యకారులను గుర్తించి సురక్షితంగా తీసుకురావడానికి సాధ్యమైన ప్రతి చర్య చేపడుతున్నాం అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఏడుగురు మత్స్యకారుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మంత్రి కోరారు. వారి కుటుంబాల ఆందోళనను ప్రభుత్వం అర్థం చేసుకుంటోంది. మన మత్స్యకా రులు క్షేమంగా తిరిగి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. వారిని గుర్తించి సురక్షితంగా తీసుకొచ్చే వరకు గాలింపు చర్యలు నిరంతరాయంగా కొనసాగిస్తాం అని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

## సజ్జల రామకృష్ణారెడ్డిపై సంగం డెయిరీ పరువు నష్టం కేసు

**రాజధాని వాయిస్, అమరావతి, ఆగస్టు 20:** సంగం డెయిరీ.. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై పరువు నష్టం కేసు దాఖలు చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) సంగం డెయిరీ నెయ్యి సరఫరా చేస్తోందని, అయితే పాల సేకరణ చేయకుండానే నెయ్యి సరఫరా చేస్తున్నారంటూ సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన ఆరోపణలను సంగం డెయిరీ తీవ్రంగా ఖండించింది. వాస్తవాలను కప్పిపుచ్చి తమ సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తప్పుడు ఆరోపణలు చేశారని పిటిషన్‌లో పేర్కొంది. చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో సంగం డెయిరీ రైతుల నుంచి ఆవుపాలను సేకరిస్తోందని, అందుకు సంబంధించిన వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఆరోపణలు చేశారని తెలిపింది. టీటీడీకి నెయ్యి సరఫరా విషయంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని సంగం డెయిరీ ఆరోపించింది.ఈ వ్యవహారంపై సంగం డెయిరీ ఎండీ గోపాలకృష్ణన్ గుంటూరు కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు ఆరోపణలు చేసిన ఎమ్మెల్సీ తూమాటి మాధవరావుపైనా కేసు నమోదు చేయాలని కోరారు. అలాగే సజ్జల చేసిన వ్యాఖ్యలను ప్రసారం చేసిన సాక్షి టీవీతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పైనా కేసు దాఖలు చేసినట్లు తెలిపారు. తమ సంస్థపై నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా ప్రతిష్ఠకు నష్టం కలిగించారని పేర్కొంటూ రూ.10 కోట్ల పరువు నష్టం చెల్లించాలని కోర్టును కోరారు. టీటీడీకి నెయ్యి సరఫరా అంశంలో తమపై వచ్చిన ఆరోపణలు వాస్తవ విరుద్ధమని సంగం డెయిరీ స్పష్టం చేస్తూ.. తమ ప్రతిష్టను దెబ్బతీసే వ్యాఖ్యలపై న్యాయపోరాటానికి దిగింది.

# గ్రూప్–1 వివాదంపై జగన్ సవాల్

ఎంపిక ప్రక్రియ కొనసాగిందని వివరించారు. మాన్యువల్ మూల్యాంకనం పూర్తయిన తర్వాత 163 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి నియామకాలు చేపట్టినట్లు జగన్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియ మొత్తం హైకోర్టు పర్యవేక్షణలోనే జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు డిజిటల్ మూల్యాంకనంపై ఆరోపణలు చేయడం ద్వారా ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వారి జీవితాలతో ఆడుకుం టున్నారని విమర్శించారు. వాస్తవాలు పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం ప్రచారం చేయడం బాధాకరమన్నారు. గ్రూప్–1 మూల్యాంకనం హాయ్‌ల్యాండ్‌లో జరిగిందన్న ప్రచారాన్ని జగన్ ఖండించారు. అక్కడ ఎలాంటి మూల్యాంకనం జరగలేదని, ఈ విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొందని తెలిపారు. దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ఉపయోగించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. వాస్తవాల ఆధారంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారా ల కంటే నిజాలు చివరకు వెలుగులోకి వస్తాయని జగన్ పేర్కొన్నారు. నాలుగేళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థుల భవిష్యత్తును రాజకీయ ఆరోపణలతో దెబ్బతీయకూడదని సూచించారు. డీఎస్సీ మరియు గ్రూప్–1 అంశాలపై పారదర్శక దర్యాప్తు జరిగితే నిజానిజాలు బయటపడతాయని అన్నారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని,ఎన్ని ఆరోపణలు చేసినా సత్యమే గెలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

## ఐజీఐ విమానాశ్రయంలో కార్గో సేవల ప్రారంభం




ప్రోత్సాహం లభించనుంది. ప్రపంచ వ్యాపార కేంద్రాలతో అనుసంధానం బలపడుతుందని అధికారులు పేర్కొన్నారు. విస్తరించిన నెట్‌వర్క్ ద్వారా ఎయిర్ ఇండియా నెలవారీ కార్గో రవాణా సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం నెలకు 1,763 మెట్రిక్ టన్నులుగా ఉన్న సరుకు రవాణా పరిమాణం 3,183 మెట్రిక్ టన్నులకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇది దాదాపు 80 శాతం పెరుగుదలగా అధికారులు వెల్లడించారు.దేశంలో కార్గో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రామ్ మోహన్ నాయుడు పేర్కొన్నారు. సరుకు రవాణా వ్యవస్థను ఆధునికీకరించడం ద్వారా ఎగుమతులు, దిగుమతులకు మరింత అనుకూల వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా భారత విమానయాన రంగంలో కార్గో రవాణా సామర్థ్యం మరింత పెరిగి దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడనుందని అధికారులు అభిప్రాయపడ్డారు. దేశీయ, అంతర్జాతీయ వ్యాపార అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# భారత్--సింగపూర్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఊతం

**సింగపూర్, ఆగస్టు 20 :** భారత్--సింగపూర్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా నాలుగో భారత్--సింగపూర్ మంత్రివర్గ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో పాటు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్, కేంద్ర సహాయ మంత్రి జితిన్ ప్రసాద పాల్గొన్నారు. సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో కలిసి ద్వైపాక్షిక సంబంధాల విస్తరణపై సమగ్ర చర్చలు జరిపారు. భారత్ మరియు సింగపూర్ మధ్య ఇప్పటికే కొనసాగుతున్న వ్యూహాత్మక సంబంధాలను మరింత విస్తరించేందుకు ఇరు దేశాల ప్రతినిధులు ఆసక్తి వ్యక్తం చేశారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంచే మార్గాలపై సమావేశంలో చర్చించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త భాగస్వామ్య అవకాశాలను కూడా పరిశీలించారు.కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ అధునాతన తయారీ రంగంలో ఇరు దేశాల మధ్య సహకారం పెరిగితే పారిశ్రామికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఉత్పాదక రంగంలో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల మార్పిడి ద్వారా పరస్పర ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచేందుకు అనుకూల వాతావరణం కల్పించడంపై కూడా చర్చించినట్లు వెల్లడించారు. ఆర్థిక సాంకేతిక సేవలు, డిజిటలీకరణ రంగాలు సమావేశంలో ప్రధాన చర్చాంశాలుగా నిలిచాయి. ఫిన్‌టెక్, డిజిటల్ చెల్లింపులు, ఆవిష్కరణలకు సంబంధించిన అంశాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు ఇరు దేశాలు సానుకూలంగా స్పందించాయి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి అవసరమైన విధానాలు, అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నాయి.ఆరోగ్య రంగం, సుస్థిర అభివృద్ధి అంశాలపైనా ప్రత్యేకంగా చర్చించారు. వైద్య సేవలు, ఆరోగ్య సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ, హరిత ఇంధన వినియోగం వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనేందుకు సంయుక్త కార్యక్రమాల అవసరాన్ని సమావేశం గుర్తించింది. భారత్--సింగపూర్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఈ సమావేశం కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

## చంద్రబాబు ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారు: ఎంపీ శ్రీభరత్



**రాజధాని వాయిస్,విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించా లని ఏపీ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని విశాఖపట్నం టీడీపీ ఎంపీ శ్రీభరత్ స్వాగతించారు. విశాఖపట్నం ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి కూటమి భాగస్వామ్య పక్షాలు భారీ విజయం సాధిస్తాయని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన అరాచ కాల నుంచి రాష్ట్రం ఇంకా పూర్తిగా కోలుకోలేదని, ప్రత్యర్థి పార్టీలో ఉన్నవారికి తమ బాధ్యత ఏంటో కూడా అర్థం కావడం లేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ఆదర్శవంతమైన పాలన అందిస్తోందని కొనియాడారు.ఇక ప్రాంతీయ నీటి ఎద్దడి అంశంపై స్పందిస్తూ... ఎల్‌నినో ప్రభావం వల్లే తాగునీటి ఎద్దడి సమస్యలు తలెత్తుతున్నాయని స్పష్టం చేశారు. నీటి కొరతను ఆసరాగా చేసుకుని రాబోయే డేటా సెంటర్ల వల్ల నీటి సమస్యలు వస్తున్నాయంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డేటా సెంటర్లు ఏర్పాటు కావడానికి ఇంకా రెండేళ్ల సమయం పడుతుందని వివరించారు. కేవలం వర్షాలపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పోలవరం నీటిని విశాఖపట్నానికి తరలించే ఏర్పాట్లు వేగవంతం అవుతున్నాయని, భవిష్యత్తులో నదుల అనుసంధానం పూర్తయితే దక్షిణ భారతదేశంలో నీటి సమస్య పూర్తిగా తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రేర్ ఎర్త్ ఖనిజాలపై మంత్రి ప్రత్యేక దృష్టి

**పెర్మనెంట్ మాగ్నెట్స్ రంగంలో అవకాశాల అన్వేషణ**
**ఆంధ్రప్రదేశ్‌ను మైనింగ్ రంగంలో అగ్రస్థానానికి**
**ప్రత్యేక కోర్సుల ఏర్పాటుకు సన్నాహాలు**
**కీలక ఖనిజాల వినియోగంపై చర్చ**



**రాజధాని వాయిస్ మచిలీపట్నం, ఆగస్టు 20 :** రేర్ ఎర్త్ ఖనిజాలు, పెర్మనెంట్ మాగ్నెట్స్ రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను సద్వినియోగం చేసుకునే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ అంశాలపై ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య యుగంధర్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి హెచ్. పురుషోత్తం, ప్రొఫెసర్ వేణుబాబు మంత్రిని కలిసి పలు ప్రతిపాద నలు సమర్పించారు. సమావేశంలో రేర్ ఎర్త్ ఖనిజాల ప్రాధాన్యం, వాటి ఆధారంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, భవిష్యత్ అవసరాలపై విస్తృత చర్చ జరిగింది. ముఖ్యంగా పెర్మనెంట్ మాగ్నెట్స్ తయారీ, అధునాతన సాంకేతిక పరిశ్రమలు, విద్యుత్ వాహనాల రంగంలో ఈ ఖనిజాల వినియోగంపై నిపుణులు వివరించారు. దేశ మైనింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. రాష్ట్రంలో లభ్యమయ్యే విలువైన ఖనిజ సంపదను గుర్తించి, వాటి వినియోగాన్ని పెంచే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఖనిజాల ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక విద్యా కోర్సులు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. ఖనిజ అన్వేషణ, ప్రాసెసింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యమని వివరించారు.విమానాలు, విద్యుత్ వాహనాలు, రక్షణ రంగ పరికరాల తయారీలో వినియోగించే కీలక ఖనిజాలను వెలికితీయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు విలువ ఆధారిత పరిశ్రమలను రాష్ట్రంలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకు న్నట్లు పేర్కొన్నారు. జాతీయ కీలక ఖనిజాల విధానం--2026 ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే సహకారాన్ని పూర్తిగా వినియోగించుకుంటామని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఖనిజ రంగాన్ని బలోపేతం చేసి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో కీలక ఖనిజాల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగనున్నాయని తెలిపారు.

# విశాఖలో పోలీసు ఎస్కార్ట్ బస్సు ప్రమాదం

**జూ పార్క్ సమీపంలో తృటిలో పెను ప్రమాదం**
**హోంమంత్రి వంగలపూడి అనిత ఆరా**
**ఆరుగురు పోలీసులకు గాయాలు**
**మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు**





**రాజధాని వాయిస్: విశాఖపట్నం, ఆగస్టు 20 :** విశాఖపట్నంలోని జూ పార్క్ సమీపంలో పోలీసు ఎస్కార్ట్ బస్సుకు గురువారం ఉదయం ప్రమాదం జరిగింది. మరో వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బస్సు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు పోలీసు సిబ్బంది గాయపడగా, వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం 30 మంది ఎస్కార్ట్ సిబ్బందితో ప్రయాణిస్తున్న బస్సు జూ పార్క్ ప్రాంతానికి చేరుకున్న సమయంలో ఎదురుగా ఉన్న కారును తప్పించేందుకు డ్రైవర్ వాహనాన్ని పక్కకు మళ్లించాడు. ఈ క్రమంలో బస్సు అదుపుతప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న వాహనాల మార్గంలోకి వెళ్లింది. అదే సమయంలో మధురవాడ నుంచి విశాఖపట్నం వైపు వస్తున్న లారీ బస్సు ముందు భాగాన్ని బలంగా ఢీకొట్టింది.గుడిలోవ ప్రాంతంలో విధుల్లో ఉన్న తమ సహచరుల స్థానంలో బాధ్యతలు స్వీకరించేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో పలువురు కానిస్టేబుళ్లు గాయపడగా, వారిలో ఆరుగురు ప్రస్తుతం అరిలోవలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన సిబ్బందికి వైద్యులు ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం కారణంగా పోలీసు బస్సు తీవ్రంగా దెబ్బతింది. సమాచారం అందుకున్న అరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో దెబ్బతిన్న వాహనాన్ని తొలగించారు. అనంతరం ట్రాఫిక్ రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ప్రమాద విషయం తెలుసుకున్న రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వెంటనే స్పందించారు. విశాఖపట్నం పోలీసు కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. ప్రమాదంలో గాయపడిన పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిస్థితిపై కూడా హోంమంత్రి ఆరా తీశారు. అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుళ్లకు అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన సిబ్బంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు.

# అరకులో వైఎస్సార్‌సీపీకి మరింత బలం

**- టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు పార్టీలో చేరిక**
**- రేగం మత్స్యలింగం సమక్షంలో చేరికలు**
**- వంద కుటుంబాల వైఎస్సార్‌సీపీలో ప్రవేశం**
**- స్థానిక ఎన్నికలపై పార్టీ దృష్టి**



**రాజధాని వాయిస్ అరకు :** అరకు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరింది. డుంబ్రిగూడ మండలంలోని కొర్రయి పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు కిండంగి లైకోన్ వైఎస్సార్‌సీపీలో చేరారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సమక్షంలో, డుంబ్రిగూడ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాంగి పరశురామ్ ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం నిర్వహించారు. కిండంగి లైకోన్‌తో పాటు అంజోడ, జాంకరవలస, జాముగూడ, బొందుగూడ గ్రామాలకు చెందిన సుమారు వంద కుటుంబాలు కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీ కండువాలు కప్పి వారిని నాయకులు ఆహ్వానించారు. ఈ చేరికలతో డుంబ్రిగూడ మండలంలో పార్టీ బలోపేతానికి మరింత ఊతం లభించిందని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ గతంలో కూటమిని నమ్మి మద్దతు ఇచ్చామని, అయితే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేసే పార్టీగా భావించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని అన్నారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, టీడీపీకి చెందిన కీలక కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరడం ఇందుకు నిదర్శనమని రేగం మత్స్యలింగం పేర్కొన్నారు. అరకు నియోజకవర్గంలో రోజురోజుకూ పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతోందని, మరింత మంది నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు రేగం చాణక్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి నరసింగరావు, మండల ఉపాధ్యక్షుడు పొట్టంగి రామ్ ప్రసాద్, అశోక్ కుమార్, కిల్లో ధర్మానాయుడు, కొర్ర చిన్నబాబు, శెట్టి నీలవేణి, గుమ్మ నాగేశ్వరరావు, శెట్టి ఆనంద్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానికంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

# రాజధాని రైతులకు 41 రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు



**రాజధాని వాయిస్, అమరావతి, ఆగస్టు 20:** ప్రజారాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా చేపట్టిన సీడ్ యాక్సిస్ రహదారి కోసం భూములిచ్చిన ఉండవల్లి గ్రామానికి చెందిన 23 మంది రైతులకు 41 రిటర్నబుల్ ప్లాట్లను ఏపీ సీఆర్‌డీఏ అధికారులు ఈ-లాటరీ విధానంలో కేటాయించారు. గురువారం రాయపూడిలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో రైతుల సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు.ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ముందుగా ట్రయల్ రన్ నిర్వహించిన అనంతరం ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. మొత్తం 41 ప్లాట్లలో 26 నివాస, 15 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. లాటరీలో ప్లాట్లు పొందిన రైతులకు ఏపీ సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్ ఐఏఎస్ ప్రొవిజనల్ సర్టిఫికెట్లను అందజేశారు.ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. రైతులకు కేటాయించిన ప్లాట్లు భౌగోళికంగా ఎక్కడ ఉన్నాయో వివరించేందుకు జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లు సహకరిస్తారని తెలిపారు.కార్యక్రమంలో డైరెక్టర్ (ల్యాండ్స్) కె.ఎస్. భాగ్యరేఖ, ప్లానింగ్ విభాగం డైరెక్టర్ బి. సురేష్‌కుమార్, ఐటీ విభాగం అడిషనల్ డైరెక్టర్ వి. కుష్వంత్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏ.జి. చిన్నికృష్ణ, ప్లానింగ్, జీఐఎస్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గల్లంతైన మత్స్యకారుడి కోసం గాలింపు

**- అప్పన్న ఆచూకీకి ముమ్మర చర్యలు - హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాలు**
**- అధికారులతో పరిస్థితి సమీక్ష - బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండ**



**రాజధాని వాయిస్, అమరావతి, ఆగస్టు 20 :** సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు అప్పన్న ఆచూకీ కోసం గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర హోంమంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు, కోస్ట్‌గార్డు శాఖలు సమన్వయంతో విస్తృత స్థాయిలో గాలింపు చేపట్టాలని సూచించారు. ఈ నెల 16న ఎనిమిది మంది మత్స్యకారులు వేటకు వెళ్లిన సమయంలో సముద్ర తీరానికి సుమారు 12 నాటికల్ మైళ్ల దూరంలో బోటు ప్రమాదానికి గురైనట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ ప్రమాదంలో మత్స్యకారుడు అప్పన్న గల్లంతయ్యాడని తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను మంత్రి అధికారుల నుంచి తెలుసుకున్నారు.ప్రమాద సమయంలో బోటులో ఉన్న మిగిలిన మత్స్యకారుల పరిస్థితిపై కూడా వంగలపూడి అనిత ఆరా తీశారు. వారికి అవసరమైన సహాయం అందిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గల్లంతైన అప్పన్నను క్షేమంగా గుర్తించి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగిం చాలని మంత్రి సూచించారు. సముద్ర ప్రాంతాల్లో గాలింపు చర్యలను నిరంతరాయంగా కొనసాగించి ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని స్పష్టం చేశారు.సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చూడాలని సంబంధిత శాఖలకు సూచించారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని హోంమంత్రి హామీ ఇచ్చారు. గాలింపు చర్యలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని, అప్పన్న ఆచూకీ లభించే వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశించారు.

# విద్యుత్ శాఖ పరీక్ష ఏర్పాట్లపై సమీక్ష



**రాజధాని వాయిస్, కర్నూలు:** విద్యుత్ శాఖలో సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ పోస్టుల భర్తీకి నిర్వహించనున్న పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ సమావేశంలో పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, కూర్చునే ఏర్పాట్లు తదితర సౌకర్యాలను కల్పించాలని అధికారులకు సూచించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గదర్శకాలను ప్రచారం చేయాలని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా ఉండేలా పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.పరీక్షా విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ, పోలీసు శాఖతో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి సూచించారు.

# శిరో రక్షా--ప్రాణ రక్షా అవగాహన కార్యక్రమం

**– రోడ్డు భద్రతపై ప్రత్యేక ప్రచారం – ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాలతో నిర్వహణ**
**– హెల్మెట్ వినియోగంపై ప్రజలకు సూచనలు**
**– ప్రాణాల రక్షణే ప్రధాన లక్ష్యమని వెల్లడి**






**రాజధాని వాయిస్, బాపట్ల, ఆగస్టు 20 :** రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ద్విచక్ర వాహనదారుల్లో భద్రతా అవగాహన పెంపొందించేందుకు బాపట్ల జిల్లా పోలీసులు "శిరో రక్షా -- ప్రాణ రక్షా" కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని అధికారులు సూచించారు. హెల్మెట్ వినియోగం వల్ల ప్రమాదాల సమయంలో తలకు తీవ్రమైన గాయాలు కాకుండా ప్రాణాలను కాపాడుకోవచ్చని వివరించారు. భద్రతా నియమాల పాటన ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వాహనం నడిపేటప్పుడు వేగ నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల పాటన, మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి అంశాలపై కూడా ప్రజలకు సూచనలు చేశారు. నిర్లక్ష్యం కారణంగా జరిగే ప్రమాదాలను తగ్గించడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా తలకు గాయాలు కావడం వల్ల ప్రాణనష్టం సంభవిస్తోందని అధికారులు పేర్కొన్నారు. అందువల్ల హెల్మెట్‌ను కేవలం జరిమానాల భయంతో కాకుండా స్వీయ రక్షణ కోసం వినియోగిం చాలని అవగాహన కల్పించారు.విద్యార్థులు, యువత, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రయాణంలో హెల్మెట్ ధరించే అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రాణనష్టాన్ని నివారించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని కోరారు.

## ఒప్పిచర్ల హై స్కూల్ విద్యార్థులకు బయోజైమ్ సంస్థ ఉపకార వేతనాలు పంపిణి



**కారంపూడి.ఆగస్టు 20రాజదాని వాయిస్** :మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒప్పిచర్ల లో బయోస్టార్డ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం పదవ తరగతి చదువుచున్న 10 మంది విద్యార్థుల కు 9 వ తరగతి లో ఉత్తమ ప్రతిభ కనబరచి నందుకు గాను ఒక్కొక్కరికి 3 వేల రూపాయలు చొప్పున 30 వేల రూపాయలు ఉపకార వేతనాలను ఆ కంపెనీ రిజనల్ మేనేజర్ టి వేణుగోపాల్ రెడ్డి అందించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విలీయం శౌరి బాబు తెలిపారు.కంపెనీ మేనేజర్ టి.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి లో కూడ ఉత్తమ ఫలితాలు తీసుకొచ్చి పాఠశాల కు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కంపెనీ డిస్టుబ్యూటర్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కంపెనీ సభ్యులు యం. రామాంజినేయులు,యం.శ్రీనివాసరావు, షైక్ బాజీ, హరి విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు అండగా నిలిచే పార్టీ తెలుగుదేశం పార్టీ

### గోళ్ళ సురేష్ యాదవ్



**కారంపూడి ఆగస్టు 20 రాజదాని వాయిస్** :బీసీ లకు అండగా నిలిచే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని కారంపూడి మండల టీడీపీ అధ్యక్షుడు గోళ్ళ సురేష్ యాదవ్ అన్నారు.స్థానిక సంస్థ ల ఎన్నికల్లో బీసీ లకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకుని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు.గత ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ను తగ్గించి రాజకీయంగా బీసీ ల గొంతు కోసిందని విమర్శించారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు తగ్గించినప్పుడు వైసీపీ బీసీ నాయకులు ఎందుకుప్రశ్నించలేదన్నారు. బీసీలకు అండ తెలుగుదేశం పార్టీ జెండా అని బీసీలకు అండగా నిలిచే తెలుగుదేశం పార్టీకి బీసీలు అండగా ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు బాల వెంకటేశ్వర్లు,మాజీ పట్టణ టీడీపీ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ,క్లస్టర్ ఇంచార్జి లు శ్రీను, ప్రభాకర్ పాల్గొన్నారు.

## నవులూరి చెన్నారెడ్డి పెద్దకర్మకు వైఎస్సార్‌సీపీ నేతల హాజరు



**రెంటచింతల.ఆగస్టు 20రాజధాని వాయిస్** :రెంటాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కన్వీనర్ దివంగత నవులూరి చెన్నారెడ్డి పెద్దకర్మ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొని చెన్నారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైకాపా నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

## బీసీల పక్షపాతి కూటమి ప్రభుత్వం పంగులూరు అంజయ్య



**కారంపూడి.ఆగస్టు 20 రాజధాని వాయిస్** :బీసీలకు నిజమైన న్యాయం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య అన్నారు. గురువారం కారంపూడిలో మీడియాతో మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం చరిత్రాత్మకమని, అన్న ఎన్టీఆర్ నాటి నుంచే టీడీపీ బీసీల పక్షాన నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

# సుగాలి ప్రీతి బాయ్‌కు న్యాయం చేయాలి

### - వైఎస్సార్సీపీ గిరిజన విభాగం డిమాండ్



**మాచర్ల. ఆగస్టు 20 రాజధాని వాయిస్:** సుగాలి ప్రీతి బాయ్ అత్యాచారం, హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వైఎస్సార్సీపీ గిరిజన విభాగం నాయకులు డిమాండ్ చేశారు. న్యాయం కోసం కర్నూలు నుంచి విజయవాడ వరకు వీల్‌చైర్ యాత్ర చేపట్టిన ప్రీతి బాయ్ తల్లి పార్వతి బాయ్‌ను ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.గురువారం పల్నాడు జిల్లా మాచర్లలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేరాజోత్ హనుమంతు నాయక్, జిల్లా నాయకుడు రవి నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు రామావత్ సుబ్రమణ్యం నాయక్ మాట్లాడుతూ,ఈ వ్యాఖ్యలు చేశారు. తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై న్యాయం కోసం దివ్యాంగురాలైన పార్వతి బాయ్ చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు.ప్రీతి బాయ్‌కు న్యాయం చేస్తామని గతంలో హామీలు ఇచ్చిన ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఆమె తల్లికి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, వీల్‌చైర్ యాత్రను అడ్డుకోవడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. నిందితులను కాపాడే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకుని, కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రీతి బాయ్ కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు చట్టపరంగా వర్తించే అన్ని కఠిన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు గిరిజనులు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తారని నాయకులు హెచ్చరించారు.ఈ సమావేశంలో రామావత్ బ్రహ్మం నాయక్, మాజీ సర్పంచ్ వి. రవీందర్ నాయక్, లచ్చు నాయక్, రామావత్ బాలు నాయక్, రామావత్ మాధ్య నాయక్, కేతావత్ రవి నాయక్, జరపాల శివ తదితరులు పాల్గొన్నారు.

## తన భూమిని కాపాడాలని మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించిన బాధితుడు



**మాచర్ల.ఆగస్టు 20రాజధాని వాయిస్** :తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన స్థలాన్ని కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలతో ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితుడు పాలకుర్తి పెద్ద వెంకటేశ్వర్లు హ్యూమన్ రైట్స్ ప్రొటెక్ట్ వెల్ఫేర్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు గురజాల అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మాచర్ల రింగ్ రోడ్డు సమీపంలోని సర్వే నంబర్ 1072 పరిధిలోని 1.79 సెంట్ల భూమికి సంబంధించి తమ వద్ద చట్టబద్ధమైన పత్రాలు ఉన్నాయని, అయితే కొందరు వ్యక్తులు వివాదం సృష్టిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం లభించలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడు అందజేసిన పత్రాలను పరిశీలించిన గురజాల అప్పారావు మాట్లాడుతూ,ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ జరిపించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## వడియరాజులు ఆధ్వర్యంలో సీఎం, డిప్యూటీ సీఎం, మాచర్ల ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



**కారంపూడి.ఆగస్టు 20రాజదాని వాయిస్** :మండల కేంద్రమైన కారంపూడి పట్టణంలోని వడియ రాజులు ఆధ్వర్యంలో కొమ్మెర బాలరాజు నేతృత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి చిత్రపటాలకు టిడిపి పల్నాడు జిల్లా కోశాధికారి జిల్లా తెలుగుదేశం పార్టీ వడ్డెర సాధికార సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమల కొండ నరసింహారావు పాలాభిషేకం అభిషేకం చేశారు. ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మాచర్ల పట్టణ టిడిపి అధ్యక్షుడు కొమ్మెర దుర్గారావు మాట్లాడుతూ, తెలుగు దేశం పార్టీలో బీసీలకు పెద్ద పీట వేసిన సీఎం నారా చంద్రబాబు నాయుడుకు మరియు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.బీసీలు రాజకీయంగా ఎదగాలంటే తెలుగుదేశం పార్టీకే టిడిపి ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని మరియు బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించి బీసీలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్దపీట వేశారని వడియ రాజులు కులానికి చెందిన రమాదేవి అనే సాధారణ టిడిపి మహిళకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి వడియరాజుల పక్షాన నిలబడ్డ ప్రభుత్వం టిడిపి అన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల చెన్నకేశవ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొమ్మెర అనంత రాములు నరసరావుపేట వడ్డెర సంఘం నాయకులు బండారు అఖిల్ చంద్ర కీర్తి కారంపూడి ఒడ్డెర సంఘం నాయకులు కొమ్మర లక్ష్మయ్య ,వల్లపు బాబు, చంద్రగిరి ఏడుకొండలు, చల్లా శ్రీను, కొమ్మెర యేసు రాజు, కొమ్మెర నాగలక్ష్మి (దుర్గి యాడ్ డైరెక్టర్)టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సమగ్ర సవరణ--2026పై సమీక్షా సమావేశం..




**నరసరావుపేట, ఆగస్టు 20 రాజదాని వాయిస్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, 2026లో భాగంగా పల్నాడు జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు, పురావస్తు మరియు మ్యూజియంల శాఖ కమీషనర్ ముత్యాలరాజు రేవుగురువారం ఉదయం కలెక్టర్ కార్యాలయం, నరసరావుపేటలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశంనిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతిక శుక్లా కూడా పాల్గొన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ,వాస్తవ తనిఖీ, తొలగింపులు, చేర్పులు, దోషాల సవరణ, ఫోటోల అప్డేట్ తదితర అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించి, అధికారులకు అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అర్హులైన ఓటర్లు జాబితా నుంచి మినహాయింపు పొందకుండా,సక్రమ పద్ధతుల్లో నిర్ధారణ చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు.

**టెండరు ప్రకటన**

గ్రామ పంచాయతీ కార్యాలయము
తెలగాయపాలెం

గుంటూరు జిల్లా, కాకుమాను మండలం, తెలగాయపాలెం గ్రామ పంచాయతీకి ఈ దిగువ తెలిపిన షెడ్యూల్‌లో చూపిన సామానులు సరఫరా చేయుటకు కొరకు సీల్డు టెండర్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి గారిచే లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని ది. 24-08-2026వ తేదీ మధ్యాహ్నం గం. 3.00ల వరకు స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం గం. 3.30లకు హాజరైన టెండర్‌దారుల సమక్షంలో తెరవబడును. టెండర్లు దాఖలు చేయువారు షెడ్యూల్‌లో తెలిపిన ధరావత్తు చెల్లించిన రశీదును జతపరచి టెండరు దాఖలు చేయవలెను. ధరావత్తు చెల్లించని టెండర్లు తిరస్కరించబడును. ఏ కారణము తెలుపకయే టెండర్లు వాయిదా వేయుటకు లేదా మార్పులు చేయుటకు కార్యదర్శిగారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరములకు కార్యలయం పనివేళల యందు సంప్రదించవచ్చును.

షెడ్యూలు

| వ.నెం. | వివరములు | టెండరు ధరవత్తు |
|---|---|---|
| 1. | 2026-27 సంవత్సరానికి గ్రామ పంచాయతీకి అవసరమగు ఎలక్ట్రికల్ సామాగ్రి సరఫరా చేయుట | రూ.100-00 |

కె. సరిత, పంచాయతి కార్యదర్శి, తెలగాయ పాలెం గ్రామం
తెలగాయ పాలెం గ్రామ పంచాయతీ, కాకుమాను మండలం

## నేడు విశేషఅలంకారంలో శ్రీ భ్రమరాంబ దేవి అమ్మవారి దర్శనం



**పెదకాకాని, ఆగస్టు 20 రాజధాని వాయిస్:** శ్రావణ మాస పర్వదిన ము లలో భాగముగా 2వ,రోజు శుక్రవారము శ్రీ భ్రమరాంబ దేవి అమ్మవారిని పసుపు కొమ్ములు ప్రత్యేక అలంకారములో భక్తులు దర్శనం చేసుకొనుటకు ఏర్పా టు పూర్తి చేసినట్లు ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకు మార్, పాలకమండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావులు తెలిపారు. 3వ,శుక్రవారము చీరల అలంకా రం, 4వ, శుక్రవారం గాజులు అలంకారము 5వ, శుక్రవారం నెమలికించం అలంకారములో భక్తులకు దర్శనము కలుగునని తెలిపారు. ఆలయ సన్నిధిలో సెప్టెంబర్.4న 4వ, శుక్రవారం ఉచిత సాముహిక శ్రావణమాస వరలక్ష్మీ వత్రములు శ్రీ భ్రమ రాంబ అమ్మవారికి లక్ష గాజులతో అలంకరణ జరుగునని తెలిపారు.

## ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయాలి

### మత్స్యకారులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య



**చీరాల, ఆగస్టు 20 రాజధాని వాయిస్:** : చీరాల నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని మత్స్యకారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అసెంబ్లీలో ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి, నిర్మాణ పనుల పై ఆయన ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.హార్బర్ల నిర్మాణం పూర్తయితే మత్స్యకారులకు చేపల వేట, నిల్వ, రవాణా, మార్కెటిం గ్‌కు ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మౌలిక వసతులు మెరుగుపడటంతో చేపలకు మెరుగైన మార్కెట్ లభించి, మత్స్యకారుల ఆదాయం పెరిగే అవకా శం ఉంటుందని తెలిపారు.నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ఫిషింగ్ హార్బర్లను మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చీరాల నియోజకవర్గం లోని మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే వరకు తన వంతు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య స్పష్టం చేశారు.

## జాలేరమ్మ, దుర్గమ్మ, పోలేరమ్మ ఆలయ భూమిపూజ కార్యక్రమంలో ఏం మహేంద్ర నాథ్



**వేటపాలెంఆగస్టు 20 రాజధాని వాయిస్:** వేటపాలెం మండల పరిధి,లోని కటారి వారిపాలెం గ్రామంలోని జాలేరమ్మ తల్లి, దుర్గమ్మ తల్లి, పోలేరమ్మ తల్లి అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ.. దేవాలయాలు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. ఆలయ నిర్మాణం భక్తి, ఆధ్యాత్మికతతో పాటు గ్రామ ప్రజల ఐక్యతకు దోహదపడుతుందని, గ్రామాభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తికావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో కూటమి నాయకు లు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికి టిడిపి తప్పక గుర్తిస్తుంది

### జిల్లా ఎస్సీ సెల్ మాజీ సెక్రెటరీ నంబూరు సాంబయ్య



**పెదకాకాని ఆగస్టు 20 రాజధాని వాయిస్::-** పార్టీని నమ్ముకొని, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే టిడిపి కార్యకర్తలకు పార్టీ నాయకత్వం తప్పక గుర్తిస్తుందని జిల్లా ఎస్సీ సెల్ మాజీ సెక్రటరీ నంబూరు సాంబయ్య అన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పర్ల రామయ్యకు, బీసీ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన దళవా యి రమాదేవి లకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీసీలకు స్థానిక సంస్థలలో 34%, మున్సిపాలిటీలలో 33.3% రిజర్వేషన్లు కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి లోకేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com